రామభద్రపురంలో.. సమస్యల తిష్ట!



కాలువల ఆక్రమణ కారణంగా రోడ్డుపైనే పారుతున్న వరదనీరు

- మేజర్ పంచాయతీలో కానరాని సౌకర్యాలు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- నిత్యం వేధిస్తోన్న ట్రాఫిక్ సమస్య
- అభివృద్ధికి నోచుకోని అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్
- అధికారంలోకి రాగానే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని నేతల ప్రగల్బాలు
- ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా చర్యలు శూన్యం

రామభద్రపురం:

స్థానిక మేజర్ పంచాయతీలో సమస్యలు తిష్టవేశాయి. 15 వేలకు పైబడి జనాభా ఉన్న ఈ గ్రామంలో అధ్వానంగా రహదారులు, వీధి కాలువలు, మౌలిక సదుపాయాలకు దూరంగా శివారు కాలనీలు, కనీస అభివృద్ధికి నోచుకోని అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్, నిత్యం వేధించే ట్రాఫిక్ సమస్య వంటివి ఉన్నాయి. గతంలోని ఎన్నో సమస్యలకు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిష్కారం చూపినా ఇంకా పలు సమస్యలు మిగిలే ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతామని టీడీపీ నాయకులు ప్రగల్బాలు పలికారు. ఇప్పుడు అధికారం చేపట్టి ఐదు నెలలు గడిచినా ఆ దిశగా చర్యలు శూన్యంగా కనిపిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సమస్యలు ఇలా..

- ప్రధానంగా రామభద్రపురం మేజర్ పంచాయతీలో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చాలా వీధుల్లోని కాలువలు, రోడ్లు చాలా వరకు శిథిలమయ్యాయి. శ్రీరామ్‌నగర్, మారుతీ కాలనీల్లోని కాలువలు అయితే పూర్తిగా పాడయ్యాయి. వీటికి తోడు తాగునీటి సమస్య అధికంగా ఉంది.
- స్థానిక గాంధీబొమ్మ జంక్షన్ నుంచి బొబ్బిలి వెళ్లే రహదారి పక్కన ఉన్న టీబీఆర్ సినిమా హాల్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణ యజమానుల ఆక్రమణలు రోడ్డు వరకు చోటుచేసుకున్నాయి. రహదారి పక్కనే ఉన్న మురుగునీటి కాలువలను సైతం కప్పేసి పూర్తిగా ఆక్రమించుకోవడం జరిగింది. దీంతో రోడ్డు ఇరుకుగా తయారై ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అలాగే బొబ్బిలి–సాలూరు జంక్షన్ నుంచి గ్రామం మధ్యలో నుంచి సాలూరు వెళ్లే రహదారి(గ్రామం చివరి) వరకు నివాసాల యజమానులు కాలువలపై ఇంటి నిర్మాణాలను చేయడం, బైపాస్ రోడ్డు సౌకర్యం ఉన్నా.. సాలూరు నుంచి నిత్యం గ్రామం మధ్యలోని నుంచి భారీ వాహనాలు రావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల ఆక్రమణలు తొలగించి ఈ రోడ్డును విస్తరించాల్సి ఉంది. రోడ్డంతా అడుగడుగునా గోతులతో నిండి ఉండడంతో అటు వైపుగా వెళ్లే వారంతా అవస్థలు పడుతున్నారు.
- రోజూ సుమారు రూ.20 లక్షలు పైబడి లావాదేవీలు జరగడంతో పాటు ఏడాదికి రూ.40 లక్షల వరకు ఆశీలు రూపంలో ఆదాయం వస్తున్నా అంతర్ రాష్ట్ర కూరగాయల మార్కెట్ కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. పాలకులు మారుతున్నా మార్కెట్ మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించడం లేదు. వర్షం పడితే మార్కెట్ అంతా బురదతో చిత్తడిగా తయారవడం వల్ల అప్పుడప్పుడూ కొద్దోగొప్పో మట్టి వేసి బురద బెడద లేకుండా చేస్తున్నారు తప్ప అభివృద్ధి గురించి ఆలోచించడం లేదు. మార్కెట్‌లో ఉన్న దుకాణాలకు షెడ్ల సదుపాయం లేదు. ఎండ అయినా, వాన అయినా కూరగాయల విక్రయాలు జరుపుతున్న చిరువ్యాపారులు తాటికమ్మల పాకలలోనే విక్రయాలు చేస్తున్నారు.
- శ్రీరామ్‌నగర్ కాలనీని తాగునీటి సమస్య వేధిస్తోంది. ఇక్కడ మంచి నీటి ట్యాంకు ఏర్పాటు చేసి ఇంటింటికీ తాగునీరందించేందుకు గత ప్రభుత్వ హయాంలో రూ.1 కోటి పైబడి నిధులు మంజూరయ్యాయి. అయితే నిర్మాణానికి కాంట్రాక్టర్లు ఎవరూ రాకపోవడంతో ఆ పనులు అలాగే నిలిచిపోయాయి. అక్కడే బీసీ, ఎస్సీ కాలనీల మధ్య ఉన్నపెద్ద కాలువ కూడా పూడికలతో నిండిపోయింది. దీంతో మురుగునీటి పారుదల వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. దీంతో చుట్టుపక్కల నివాసాల వారు నిత్యం దోమలతో సహవాసం చేయాల్సిన దుస్థితి నెలకొంది. తరచూ అనారోగ్యం బారినపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- గ్రామంలో పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి. రూ.10 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన చెత్తశుద్ధి కేంద్రం నిరుపయోగంగా ప్రస్తుతం ఉంది.
- పంట కాలువలు పూర్తిగా చెత్తాచెదారాలతో నిండిపోయి సాగునీరు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యల పరిష్కారంపై పాలకులు, అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



తాటాకు షెడ్లలోనే కూరగాయలు విక్రయిస్తున్న చిరువ్యాపారులు



పూర్తిగా శిథిలమైన పెదపల్లి వీధి రోడ్డు కాలువ

గత ప్రభుత్వంలో అభివృద్ధి పనులు ఇలా..

గత ఐదేళ్లలో రామభద్రపురంలో లబ్ధిదారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.73,90,80,622లు లబ్ధి చేకూరింది. గ్రామంలో దాదాపు రూ.1.30 కోట్ల వ్యయంతో మూడు సచివాలయాలు, రూ.47.88 లక్షలతో రెండు ఆర్‌బీకేలు నిర్మించారు. రూ.7.29 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులు, రూ.60 లక్షల జీజీఎంపీ నిధులు, రూ.20.80 లక్షల ఎంపీపీ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా మొదటి దశలో రూ.13.81 లక్షలతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రూపురేఖలు మార్చగా, రూ.2.30 కోట్ల నాబార్డు నిధులతో ఉన్నత పాఠశాలకు అదనపు తరగతి గదులు, మౌలిక వసతులు కల్పించారు. రెండో విడతలో రూ.92.18 లక్షల అంచనా వ్యయంతో ఐదు పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మరమ్మతులు, మౌలిక వసతులు కల్పిస్తున్నారు. గ్రామంలోని 500 మంది పైబడి అర్హులైన పేదలకు జగనన్న కాలనీలో ఇళ్లస్థలాలు ఇచ్చారు.



చెత్తాచెదారాలతో నిండిన కూరాకుల చెరువు పంట కాలువ

సమస్యల పరిష్కారానికి కృషి..

రామభద్రపురం మేజర్ పంచాయతీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ప్రస్తుతం పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నాం. వీధుల్లోని చెత్తాచెదారం, కాలువల్లోని పూడికలు తొలగించే పనులు నిరంతరం జరుగుతున్నాయి. మిగతా సమస్యలు పరిష్కరించాలని ఉన్నతాధికారుల దృష్టికి వాటిని తీసుకువెళ్లాం.

–శ్రీనివాసరావు, ఈవో, రామభద్రపురం మేజర్ పంచాయతీ

క్లుప్తంగా

పువ్వలకు ఘన నివాళి



కూర్మినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, పువ్వల కుటుంబ సభ్యులు

రామభద్రపురం: మండలంలోని రొంపల్లిలో పువ్వల కూర్మినాయుడు ప్రథమ వర్ధంతి ఆదివారం జరిగింది. ఆయన కుటుంబ సభ్యులతో పాటు కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కలిసి కూర్మినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టి, 3 వేల మందికి పైగా జనాలకు అన్నం పెట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పువ్వల మురళీకృష్ణ, మాజీ ఎంపీటీసీ పువ్వల నారాయణరావు, పువ్వల శ్రీనివాసరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



వెంకటరమణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బాడంగి: వైఎస్సార్ సీపీ కార్యకర్త ముగడ వెంకటరమణను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మండల కేంద్రంలో ఆదివారం కలిసి పరామర్శించారు. కొన్నాళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటరమణ కాలు విరిగిపోవడంతో శస్త్రచికిత్స చేయించుకోగా, ఇటీవల అదే కాలుకు వాపు, నొప్పి రావడంతో మళ్లీ ఆయన ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి ఆయన ఇంటికి వెళ్లి, ఆయన ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు గుణుపూరు లక్షుంనాయుడు, గొర్లె శంకరరావు, యందవ బంగారురాజు, తెంటు సింహాచలం, తెంటు తిరుపతి, గోపీ, శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నందెన్న ఉత్సవాలు



పెరుమాళిలో పూజలు చేస్తున్న భక్తులు

తెర్లాం: మండలంలోని జగన్నాథవలస, పెరుమాళి, తెర్లాం, గొలుగువలస, వెలగవలస, ఆమిటి గ్రామాల్లో నందెన్న ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం కలశ పూజలు చేశారు. నాగులచవితి వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

పారిశుధ్య పనులు



కందిశలో పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్

రేగిడి: మండలంలోని కందిశ, తునివాడ, వెంకంపేట, పాతచెలికానివలస తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు ఆదివారం నిర్వహించారు. వీధుల్లో ఎక్కడపడితే అక్కడ ఉన్న చెత్తాచెదారంతో పాటు కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించారు. గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా తీసుకునే జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇలా పారిశుధ్య పనులు చేయిస్తున్నామని ఎంపీడీవో శ్యామలాకుమారి తెలిపారు.

గణిత పోటీలకు విశేష స్పందన..

రాజాం: స్థానిక డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మండల స్థాయి గణిత క్విజ్ పోటీలకు విశేష స్పందన లభించింది. సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన 8, 9, 10వ తరగతులకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఎనిమిదో తరగతి నుంచి ఎనిమిది మంది, తొమ్మిదో తరగతి నుంచి ఏడుగురు, పదో తరగతి నుంచి ఏడుగురు విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారంతా డిసెంబరులో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆర్‌వీజీఎస్ మురళీకృష్ణ, రిటైర్డ్ హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి గణిత క్విజ్ పోటీల్లో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో పదో తరగతికి సంబంధించి, లక్ష్మీపురం పాఠశాలకు చెందిన పండూరి అభిరామ్, అంబఖండి పాఠశాలకు చెందిన మురళీకృష్ణలు ద్వితీయ స్థానాలు సాధించారు. తొమ్మిదో తరగతికి సంబంధించి, రేగిడి పాఠశాలకు చెందిన దాసరి విష్ణుప్రియ, లక్ష్మీపురం పాఠశాలకు చెందిన కెంబూరు మేఘనశ్రీలు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఎనిమిదో తరగతిలో లక్ష్మీపురానికి చెందిన కె.పవన్‌చంద్ర ప్రథమ స్థానంలో, అదే పాఠశాలకు చెందిన వల్లూరి నవ్యశ్రీ ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు, హెచ్‌ఎం మరడాన రామినాయుడు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు కృష్ణంరాజు, హుస్సేన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



రాజాం: క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు



రేగిడి: సంకిలి పాఠశాలలో మండల స్థాయి గణిత క్విజ్ పోటీలు

17న నృత్య పోటీలు

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ ఆడిటోరియంలో ఈ నెల 17వ తేదీన నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీకళాభారతి ప్రధాన కార్యదర్శి నంబియార్ వేణుగోపాలరావు తెలిపారు. ఇదే విషయమై ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని, విద్యార్థుల్లోని కళానైపుణ్యం గుర్తించి, ప్రోత్సహించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 9, 10వ తరగతుల విద్యార్థులను సీనియర్ల విభాగం గానూ, 6, 7, 8వ తరగతుల విద్యార్థులను జూనియర్ల విభాగం గానూ, 3, 4, 5వ తరగతుల విద్యార్థులను సబ్‌జూనియర్ల విభాగం గానూ పరిగణించి, ఆయా విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఫోన్ నంబర్ 9440744741ను సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు మింది విజయమోహనరావు, పుల్లెల శ్రీనివాసరావు, డీవీ అప్పారావు, బి.భవాని, టి.కమల్‌కుమార్, జె.కొండలరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీకళాభారతి ప్రధాన కార్యదర్శి వేణుగోపాలరావు

అన్నసమారాధన

రాజాం: పట్టణంలోని కొండంపేటలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఆదివారం జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో 600 మందికి పైగా అయ్యప్ప, శివస్వాములు పాల్గొని, స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎం.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం..

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో చిరువ్యాపారి వారణాసి జగన్నాథస్వామి నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగిస్తున్నారు. గ్రామంలో ఆయన నిర్మించిన శ్రీరామధర్మక్షేత్రంలోనే ఏడేళ్లుగా అనాథలు, సాధువులకు స్వయంగా వండి వడ్డిస్తుండడం తెలిసిందే. ఆదివారం ఎప్పటిలాగే పలువురికి ఆయన అన్నదానం చేశారు. ఆయన తన సంపాదనలో కొంతభాగం, దాతలు అందించిన సాయంతో ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు తెలిపారు.



రాజాం: అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పుస్తక పఠనంతో అపార జ్ఞానం

తెర్లాం: పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం మన సొంతమవుతుందని, విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులతో పుస్తకాలు ఏ విధంగా చదివి, అర్థం చేసుకోవాలన్న విషయాలను ఆయన నేర్పించారు. జ్ఞానం పంచే పుస్తకాలతో పాటు గొప్ప వ్యక్తుల జీవితచరిత్రలను తప్పకుండా చదవాలన్నారు. చిల్డ్రన్స్ క్లబ్‌లో విద్యార్థులంతా చేరాలని, అన్ని దినపత్రికలు, కథలు, కాంపిటేటివ్ పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలు చదవాలని సూచించారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశరరావు తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా కంప్యూటర్ విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటర్ నేర్చుకుంటే ఆ తర్వాత కంప్యూటర్ అనే భయం ఉండదని లైబ్రేరియన్ తెలిపారు.



డ్రైనేజీ పనులు జరుగుతున్న దృశ్యం

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణ పనులు

రాజాం: పట్టణంలోని సారధి రోడ్డులో డ్రైనేజీ నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఇటీవల ఈ పనులను మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు ప్రారంభించగా, రూ.30 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు జరుగుతున్నాయని ఏఈ వెంకట్ తెలిపారు. ఇక్కడి కాలువను నేరుగా పట్టణ శివారు ప్రాంతంలోని సారధి గెడ్డకు అనుసంధానం చేస్తున్నామన్నారు.

దుస్తుల పంపిణీ

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో యానాదుల కుటుంబాల పిల్లలకు వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాసు మాస్టారు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. శీతాకాలం రానుండడంతో దాదాపు 30 కుటుంబాలకు చెందిన పిల్లలకు స్వెట్టర్లు, రగ్గులు, ఉన్ని దుస్తులు అందజేసి ఔదార్యం చాటుకున్నారు.

ఆకట్టుకున్న సాయినామ సంకీర్తన



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రేగిడి: స్థానిక విశ్వసాయి మందిరంలో భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అఖండ సాయినామ సంకీర్తన ఆకట్టుకుంది. 24 గంటల పాటు నిర్విరామంగా కొనసాగిన ఈ కార్యక్రమం భక్తులను అలరించింది. అనంతరం భక్తులకు ప్రసాదం అందించారు.

పిచ్చిమొక్కలు తొలగించరూ..

రామభద్రపురం: మండల కేంద్రం నుంచి బొబ్బిలి వెళ్లే జాతీయ రహదారిలో చొక్కాపువాని చెరువు మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. జాతీయ రహదారి కావడంతో ఇదే దారిలో రాయగడ, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి రోజుకు కొన్నివేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కల కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని, ఇలా అయితే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇట్లామామిడిపల్లి, నరసాపురం, పాతరేగ తదితర గ్రామాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా కూడా పిచ్చిమొక్కలు ఉండడంతో ఇబ్బందిగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, పిచ్చిమొక్కల తొలగింపు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



చొక్కాపువాని చెరువు వద్ద రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

తుప్పల తొలగింపు

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలో రాజాం–రామభద్రపురం ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలు, డొంకలు (జంగిల్)ను రెండు రోజులుగా తొలగిస్తున్నారు. మండల సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి, కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగిల్స్‌తో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వాటిని తొలగిస్తున్నామని ఆయన ఆదివారం తెలిపారు.



ట్రాక్టరు సాయంతో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

‘చి’వ‘రి’లో సాగునీటికి అవస్థలు



వరి పంట సాగు చేస్తున్న రైతులకు కష్టాలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ఆఖరి దశలోని పంట.. నీరందక ఎండిపోయే పరిస్థితిలో ఉంది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పాటు పంట కాలువల ద్వారా అంతగా సాగునీటి సరఫరా లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో చేతికి అందివచ్చే పంటను రక్షించుకునేందుకు అన్నదాతలు ఆపసోపాలు పడుతున్నారు. రాత్రి, పగలూ అనే తేడా లేకుండా ఇంజిన్ సాయంతో పంటకు నీరందించి, పంటను బతికించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

–బాడంగి

పండ్లు, పూల ధరలు పైపైకి..

కార్తీకమాసం వేళ పండ్లు, పూల ధరలు అమాంతం పెరిగాయి. ఈ నెల రోజులూ అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తుండడంతో వీటికి బాగా గిరాకీ ఏర్పడింది. భగవంతుడికి నైవేద్యంగా సమర్పించేందుకు పండ్లు, పూలనే అధికంగా వినియోగిస్తారు. ఈ నేపథ్యంలో బొబ్బిలి మార్కెట్‌లో వాటి ధరలు కళ్లు చెదిరేలా ఉన్నాయి. ఓ పెద్ద అరటి పండ్లు రూ.60 నుంచి రూ.100 ధర పలుకుతుండగా, కిలో బంతిపూలు రూ.400 నుంచి రూ.450 వరకు ధర పలుకుతుండడం విశేషం.

–బొబ్బిలి



ఇంటికి వెలుగు ఇల్లాలు



ప్రపంచ గృహిణుల దినోత్సవం పురస్కరించుకుని, రాజాం పట్టణంలోని నరసింహనాయుడు కాలనీలో గృహిణులను ఇలా కుర్చీల్లో కూర్చోబెట్టి మరీ సత్కరించారు. ఆదివారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో పిల్లలంతా తమ తల్లుల పాదాలు కడిగి, పూజలు చేశారు. ఇంటికి వెలుగు ఇల్లాలే అని, ఏ ఇల్లు అయినా అందంగా, ఆనందంగా ఉందంటే దానికి ముఖ్య కారణం ఆ ఇంటి ఇల్లాలే అని పెద్దలు ప్రశంసించారు. తమ కష్టాన్ని కూడా గుర్తించి, గౌరవించే రోజు ఒకటుండడంతో గృహిణులు మురిసిపోయారు.

–రాజాం

పంటకోత ప్రయోగం

రేగిడి మండలం, చాటాయవలస గ్రామంలో రైతు పైల తవిటినాయుడుకు చెందిన వరి పొలంలో పంట కోత ప్రయోగం ఆదివారం నిర్వహించారు. నిర్దేశిత కొలతల మేర చేపట్టిన ఈ ప్రయోగం ద్వారా ఎకరా విస్తీర్ణంలో 30 బస్తాల పైగా ధాన్యం దిగుబడి వస్తున్నట్లు ఏవో జి.మురళీకృష్ణ, మండల ఉపగణాంక అధికారి ఏసుబాబులు అంచనా వేశారు. మండల వ్యాప్తంగా 101 మంది రైతుల పొలాల్లో 114 పంట కోత ప్రయోగాలు చేసేందుకు నిర్ణయించామని, దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు.

–రేగిడి

